అమెరికా హోదాతో రెచ్చిపోతున్న అతనికి తెలుగమ్మాయి చెప్పిన గుణపాఠం!

# అమెరికా పెళ్లి

గంటి రమాదేవి కథ

గంటి సుబ్బారావు అన్న నా పేరు అమెరికా సంయుక్త రాష్ట్రాలకు రాగానే ''రావ్ ఎస్. గంటి'' గా మారిపోయింది. ఆకాశంలో కొంగలూ, కొబ్బరికాయులు చూసే నేను ''నాసా''లో అంగారక గ్రహ యాత్ర టీములో సభ్యుడిని.

అప్పనపల్లి పాక స్కూలులో వున్నప్పుడు ''ఓరి వెధవా! నువ్వు సుబ్బిగాడివా'' అనేవాళ్లు. మామిడికుదురు హైస్కూల్లో చదువుతున్నప్పుడు ''సుబ్బయ్యా! స్కూలుకెళతన్నావా?'' అని... విశాఖ ఆంధ్రా యూనివర్శిటీలో బి.ఎస్‌సి చేస్తున్నప్పుడు ''మన సుబ్బయ్య విసాపట్నంలో గ్యాడియేట్ చదూతున్నాడు'' అనేవారు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో పోస్టుగ్రాడ్యుయేషన్ చేస్తున్నప్పుడు, పిహెచ్‌డికి 'మిన్సోటా పోలీస్' యూనివర్శిటీకి వెళ్లినప్పుడు జనం దూరందూరంగా జరిగి ''ఒరే కళ్లు కాపడ్డలే - అబ్బాయ్‌గోరు అస్తన్నారు తప్పుకో - ఎదవంటాని ఎదవ'' అని నామీద గౌరవాన్ని ఎదుటివాడి తిట్లరూపంలో చూపించేవారు.

అక్కడితో నావాళ్లతో సంబంధం తెగిపోయింది. నావాళ్లు? ఎర్రటి జేగురు రంగు పూసుకుని సుళ్లు తిరుగుతూ పరుగులెత్తే, పడుచుగోదారి! చల్లగా, మెల్లగా, తెల్లటి కొంగలతో, పరుగులు తీసే మేఘమాలికలు! మారిన కాలంతోపాటు వచ్చే తుషార వీచికలు, ధవళవస్త్రం కట్టిన బుద్ధ సన్యాసినిల్లాటి నీహారికా సముదాయాలు - చిక్కనా, చక్కగా



అందంగా వుండే గోదావరి సైకత సానువులు. వగరు మామిడి పిందెలు, మండుటెండలూ, మామిడిపళ్లూ, పనసపళ్లు, పాక హోటల్లో ఉల్లిపాయ పెసరట్లు - విశాఖలో వున్నా, బెనారస్‌లో వున్నా ఎప్పుడో ఒకసారి చూసుకునేవాడిని ''నావాళ్ల''ని. అమెరికాలో కోటి డాలర్లిచ్చినా ఇవి దొరకవు.

''మార్స్ యాత్ర'' అనే ప్రాజెక్ట్ ఇప్పుడు

''నాసా''లో నడుస్తూ వుంది. చంద్రగ్రహ (?) యాత్ర తర్వాత మరో ప్రిస్టేజియస్ ప్రాజెక్ట్ ఇది.

చంద్రుడి దగ్గరకు నాలుగు రోజుల్లో వెళ్లగలం - స్పేస్ క్రాఫ్ట్‌లో. అంగారక గ్రహం వెళ్లడానికి - అదే వేగంతో ఆరు నెలలు పడుతుంది. అంటే వెళ్లి రావడానికి ఒక సంవత్సరం - ఎంత శక్తివంతమైన రాకెట్ అయినా ఇంత అధిక మొత్తంలో ఇంధనం మోసుకుపోవడం అసాధ్యం. ఆ పరిశోధనలో వుండగానే, మా ''లీడర్ ఆఫ్ ది టీమ్'' అన్నాడు.

''మిస్టర్ గాంటీ! వెన్ డిడ్ యు హేవ్ లాస్ట్ వేకేషన్'' విపరీతంగా శ్రమించే అమెరికన్స్‌కి వెకేషన్ అత్యవసరం. ఆఫీసు టేబులుమీద తలపెట్టి నిద్రపోయేవాళ్లకి ఆ అవసరం లేదు

నా''వాళ్లు''ని చూసి అయిదారేళ్లయింది. రెండేళ్ల క్రితం వెకేషన్‌కి ఇటలీ వెళ్లాం. ఈసారి కోనసీమకు వెళితే - ఆ ఆలోచన రాగానే నా రక్తం ఉరుకులు పరుగులు పెట్టింది. అదే జన్మభూమి ఆకర్షణ. ఇంకో కారణం కూడా వుంది. ''మా కావిగాడి కూతురు పెళ్లి - పెదపట్నం లంకలో - అందర్నీ ఒకసారి చూడొచ్చు. ఇంకో పెద్ద కారణం వుంది.

పెళ్లికూతుర్ని చూడ్డం!

ఎయిర్ ఇండియా విమానంలో డైరెక్టు హైదరాబాద్‌కు టిక్కెట్టు తీసుకున్నాను. తొందరగానే దొరికింది. వేసవికాలపు 'రష్' ఇండియానుంచి అమెరికాకిటు. ఎయిర్ ఇండియా సర్వీసు చూసిన తర్వాత అనవసరంగా విమర్శిస్తున్నారేమోననిపించింది. మనవాళ్ల ప్రవర్తనతో చిర్రెత్తుకువచ్చి, విమాన సుందరులు అలా ప్రవర్తిస్తున్నారా

రాజమండ్రి దిగి మూడు గంటల్లో మావాడి ఊరు చేరుకున్నాను. పెళ్లి ఏర్పాట్లు చూసుకుంటున్నాడు కావిగాడు. కూతురు ఇంకా చిన్నదే - ఎందుకో పెళ్లికింత తొందర.

''మంచి సంబంధం అబ్బాయి ఎల్.ఐ.సిలో క్లర్క్. డెబ్బై వేలు కట్నం. డబ్బు ఖర్చయినా పిల్ల సుఖపడుతుంది'' అన్నాడు.

నేను 'హు' అని నిట్టూర్చి, ''ఒరే కావన్నా! నాకూ ఓ పెళ్లికూతురు కావాల్రా. ఆ అమ్మాయి అమెరికా రావడానికి సిద్ధంగా వుండాలి'' డాక్టరుగాని, ఇంజనీరుగాని అయివుండడం తప్పనిసరి'' అన్నాను.

పెళ్లి ఇంకా మూడు రోజుల వ్యవధి వుంది. ఈ లోపల ఏడు సంబంధాలు వచ్చాయి. ఎలా తెలిసిందో.

ఒకరోజు నలుగుర్ని చూశాను. మర్నాడు ముగ్గురు.

అమెరికా సంబంధం అనగానే అమెరికన్లా డ్రెస్ చేసుకోవాలని ఎవరు చెప్పారో - ఆ డ్రెస్ చూస్తే నాకే ఇబ్బందిగా వుంది.

లలిత, రాజేశ్వరి, మృధుల, వసంత, నాగమణి, మాధురి, కనకదుర్గ, సింధూజ. పెళ్లికూతుళ్లు.

అందరిలోకి అందంలో లలిత, కనకదుర్గ, మాధురి మించున్నారు. మాధురి అందంతోపాటు మొహంలో వర్చస్సు, తెలివితేటలు చూపించే కళ్లు చూసి పరవశుడిని అయిపోయాను. ఈ అమ్మాయి

డాక్టరో, ఇంజనీరో అయితే - కాని నాకు నిరాశే ఎదురయింది.

స్వర్ణసీతలా బంగారుఛాయ, కోకిలలాంటి కంఠం, నల్లటి వత్తయిన జడ, చిలకాకుపచ్చ పట్టుచీరెలో, వంగపండు రంగు జాకెట్టులో మెరిసిపోతూ వుంది. ఇలాంటి అమ్మాయి కావాలి - కాని మాధురి వట్టి బి.ఎస్సి. అమలాపురం కాలేజీ ప్రొడక్టు.

కట్నం లేదని తెలియగానే ఇంకో అరడజను సంబంధాలు వచ్చాయి. డాక్టర్ - ఇంజనీర్ కండిషన్ వినగానే వెనక్కు తగ్గారు.

మా కావన్న కూతురు నీలాంబరి పెళ్లి యాదవంగా చేశాడు. చిత్రంలో చిత్రం అది ఐదురోజుల పెళ్లి. ఈ రోజుల్లో ఏమిట్రా అంటే ''ఏం చెయ్యమంటావు సుబ్బారావూ పెళ్లికొడుకు ముత్తాత ముచ్చట అది'' అన్నాడు.

కావన్నను పీకి పాకం పట్టడానికే ఈ ఐదురోజుల పెళ్లి అని నాకు తర్వాత అర్థమైంది.

''అర్ధరాత్రి అంకమ్మ సివాలని'' రాత్రి పన్నెండు గంటలకు, పెళ్లికొడుకు ముత్తాతకి 'కాఫీ' కావాలట. పాలులేవు. ఉన్నవి తోడుపెట్టేశారు. కావన్న కంగారుపడుతుంటే అడిగాను ''బ్లాక్ కాఫీ తాగుతాడేమో అడుగు'' అన్నాను. ఆ పక్కనే వున్నట్టున్నాడు.


''మధ్యాన్నం వణ్ణం సరిగా లేదు. ఇప్పుడు బిలాకు కాపీ ఇష్టారుషయ్యా'' అని ధుమధుమలాడాడు.

పెళ్లికూతురు తండ్రి చెవిలో ఏదో ఊదింది. పది నిమిషాల్లో కాఫీ కప్పుతో మా కావన్న వచ్చాడు. ముసలాయన తాగి ''బేషుగ్గా వుంది - రోజూ ఇలా ఇచ్చి చానొచ్చుగా'' అని విడిదికి వెళ్లిపోయాడు.

మర్నాడు మధ్యాహ్నం -

పెళ్లికొడుకు పినతండ్రికి ఆంధ్రమాత గోంగూర పచ్చడి ఫ్రెష్‌గా చేసిపెట్టాలిట. 'ప్రియా' పచ్చళ్లు ఆయన తినడట.

## చేప విందు



*43 కిలోల బరువున్న కార్ప్ జాతి చేప ఫ్రాన్స్‌లోని టులేజ్ ప్రాంతపు రెస్టారెంట్ యజమానికి 'ఎమల్' నదిలో దొరికింది. దానితో నోరూరించే చేపలకూరను తయారుచేసి, వందలమంది కస్టమర్లను సంతృప్తి పరచవచ్చని సంతోషంగా చెపుతున్నాడు రెస్టారెంటు యజమాని డిస్.*

- ఎం. రజనీకుంతల (సికింద్రాబాద్)

ఆందోళనగా గాడిపొయ్యివైపు బయలుదేరాడు కామన్న. నేనూ వెనకే వెళ్లాను.

''మండు ఎండాకాలం గోంగూర ఎక్కడినుంచి వస్తుంది? మేం చెయ్యలేం'' అని చేతులెత్తేశాడు వంటవాడు.

అక్కడే వుంది నీలాంబరి - తెల్లటి మధుపర్కాలు, కర్పూరదండలు, మల్లెపూల మాలలతో కొత్త పెళ్లికూతురు.

''నాన్నా ఇటువంటి సమస్యలకు మన 'మాస్టర్ బ్రెయిన్' వుండగా భయమెందుకు'' అంది.

మధ్యాహ్నం భోజనాల్లో పెళ్లికొడుకు పినతండ్రి ''గోంగూరపచ్చడి అద్భుతం'' అని లొట్టలేసుకుంటూ తిన్నాడు.

ఆఖరిరోజు నిజంగానే ఎక్కుల్లో పడ్డాడు మావాడు. నీలాంబరి అత్తగారు కలర్‌టీవీ, వీసీపీ అడిగింది.

అయినకాడికి అప్పుచేసి చేశాడీ పెళ్లి. ఇంకా ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల - వీళ్ల భవిష్యత్తు ఎలా?

చటుక్కున ఒక ఆలోచన వచ్చింది. నా దగ్గర కొంత డబ్బుంది - అదిస్తే...

కాముడు నా దగ్గర తీసుకోడు?

ఏం చేస్తాడు?

నీలాంబరి అటుగా వెడుతుంటే అడిగాను -

''మా మాస్టర్ బ్రెయిన్ వుండగా భయంలేదు. ఆ సమస్య అదే తీరుస్తుంది''

ఏమిటో ఆ ధీమా? ఇంతకీ ఆ మాస్టర్ బ్రెయిన్ ఎవరు? ఇన్ని సమస్యలకు సమాధానాలిస్తున్నది ఎవరు? మరో ఆలోచన వచ్చి అడిగాను.

''నాకూ ఓ సమస్య వుంది? మరి మీ మాస్టర్ బ్రెయిన్ అది సాల్వ్ చేస్తుందా?''

''అది సాల్వ్ చేయలేనిది లేదు''

అది అంటే అమ్మాయా?

ఆ సాయంత్రానికి పెళ్లింట్లో మళ్లీ నవ్వులు మొలకెత్తాయి.

నాగవెల్లి... అవగానే నీలాంబరిని తీసుకుని పెళ్లివాళ్లు వెళ్లిపోయారు. మరి టీవీ, వీసీఆర్ ఇచ్చారా?

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది - సందడి లేక.

''సుబ్బారావు - ఈ పెళ్లి అయిపోగానే సుఖంగా నిద్రపోవాలని అనుకున్నాను. నిద్ర రావడంలేదు'' అన్నాడు కామన్న.

''నాకూ అంతే!'' అన్నాను.

ఆశ్చర్యంగా అడిగాడు ''నీకా?''

''నీ సమస్యలు తీర్చడానికి ఓ మాస్టర్ బ్రెయిన్ వుంది. నేను చూడాలి వీలవుతుందా?''

కామన్న గట్టిగా నవ్వి అన్నాడు. ''అదా! అది నీకూ తెలుసు. నువ్వూ చూశావు. మెట్టవీధిలో వుండే మాధురి. చాలా తెలివైన పిల్ల.

అదిరిపడ్డాను. నేను రిజెక్ట్ చేసిన మాధురా? ఎలా సాల్వ్ చేసింది ఈ సమస్యలను.

ఆ సాయంత్రం మాధురిని వెంటబెట్టుకుని వచ్చాడు కామన్న.

ఆ అమ్మాయి కళ్లల్లోకి సూటిగా చూడలేకపోయాను. నేను తిరస్కరించిన యువతి.

మాధురి చెప్పింది - అర్ధరాత్రి కాఫీ

గురించి - ''ఇది పల్లెటూరు. ఎప్పుడు పడితే అప్పుడు పాలు దొరకవు. చిక్కగా కాఫీ డికాక్షన్ - రెండు చెంచాల పంచదార నిండుగా - చిక్కటి అన్నం గంజి - కాఫీ తయారు. పాలబదులు చిక్కటి గంజి అన్న మాట - వేడిమీద చాలా బాగుంటుంది. ముసలి వయస్సులో మరీనూ''

నాకు ఆమె ఆఖరి మాటకు నవ్వొచ్చింది.

''మరి గోంగూర పచ్చడి''

''అది మరీ సులువు. మామూలు పాలకూరని బాగా తురిమి చింతపండు రసంలో రెండు గంటలు నాననిచ్చి - పచ్చడి చేసేయడమే''

''ఆల్రైట్ - కలర్ టీవీ - వీసీఆర్''

''అది కొంచెం కష్టం. పెళ్లికొడుకు తల్లికోరిక అది. ఆవిడతో ఓ బేరం పెట్టాను. ఇప్పుడే మన దేశపు టీవీ వీసీఆర్ కావాలా? మరో ఆర్నెలల్లో ఫారెన్ కలర్‌టీవీ ఒకటే కావాలా? నేననుకున్నట్టే ఆవిడ ఫారిన్ టీవీకే పడిపోయింది. కామన్న బాబాయికి వీసీఆర్ ఖర్చు తప్పింది. ఆరు నెలల వ్యవధి దక్కింది''

''ఫారిన్ టీవీ ఎలా?''

''మీరున్నారుగా''

''నేను తేనంటే''

''మన ఆర్థిక మంత్రిగారున్నారు. డ్యూటీ లేకుండా వస్తుంది ఆర్నెల్ల తర్వాత- అప్పుడు చూడొచ్చు''

మాధురి అందం ఇప్పుడు నాకు కొత్తగా కనిపిస్తోంది. ఇదివరకు సానబెట్టిన వజ్రంలా వుంది. ఇప్పుడు పసిమి బంగారంలో తాపడం చేసిన వజ్రంలా వుంది.

''మాధురీ! నాకు ఓ సమస్య వుంది - ''నాసా'' అని అంతరిక్ష పరిశోధన సంస్థ. 2009 సంవత్సరంలో అంగారక గ్రహయాత్ర తలపెట్టాం. ఆరు నెలల ప్రయాణం రాకెట్టులో. తిరుగు ప్రయాణం మరో ఆరు



నెలలు. ఇంత బరువు మోసుకువెళ్లడం కుదర్దు. నీ 'మాస్టర్ బ్రెయిన్'లో దీనికేమైనా పరిష్కారం వుందా?

మాధురి మౌనంగా వుండిపోయింది. నాకు తెలుసు. పల్లెటూర్లో వుండే ఆడపిల్లకి ఇలాంటి క్లిష్ట సమస్యలు పరిష్కారం సంగతటుంచి ముందు అర్థమేకావు. మాధురి చెప్పిన మాటలు విని, ''షాక్ అయ్యాను''

''ఇంధనం, అంగారక గ్రహంలో వాతావరణం - మీరు ఇప్పుడు అనుకుంటున్న ప్లాన్స్ వివరంగా చెప్పండి''

నాకూ ఇది ఛాలెంజిగా అనిపించింది. గాడిపొయ్యి సమస్య అనుకుంటుందా ఇది?

''అన్నీ వివరంగా రాసి నీ బాబాయిద్వారా పంపిస్తాను... ఈ రోజు రాత్రి బస్సుకి తిరుపతి వెడుతున్నాను. నాలుగు రోజుల్లో వస్తాను''

''ఎవ్వరినీ అవమానించకు - కించపరచకు'' అన్న అమెరికన్ సామెత గుర్తుకొచ్చి సీరియస్‌గా చెప్పాను. మాధురి సీరియస్‌గా ఆలోచిస్తూ వెళ్లిపోయింది.

● ● ●

తిరుపతినుంచి తిరిగొచ్చేసరికి నా తిరుగు ప్రయాణం తేదీ దగ్గరపడింది. హైద్రాబాదులో డాక్టరు సంబంధాలున్నాయట. ఢిల్లీలో కొన్ని పోటోలు చూశాను. బాగా కుదిరిపోయారు. అయినా చూద్దాం అనుకున్నాను. పెళ్లిళ్ల బిజినెస్ ట్రాన్సాక్షన్‌లా తయారయ్యాయి.

మాధురిని సీరియస్‌గా తీసుకోలేదుకాబట్టి, ఆ విషయం మర్చిపోయాను.

కామన్న భార్య మీనాక్షి అంది ''మాధురి వచ్చింది'' అని. అప్పుడు నేను ఆకాశంలోకి చూస్తున్నాను. ఆరుబయట మంచం మీద పడుకుని.

''ఇది క్లిష్టమైన సమస్యకాదు. కొంచెం సైన్సు జ్ఞానం వుండాలి. బేసిగ్గా ఇది సహారా ఎడారి సమస్యలాంటిదే. ఎడారిలో చాలారోజుల ప్రయాణం. ఆహారం నీరు బాగా కావాలి. పూర్వపు అరబ్బులు ఈ యాత్రకు రెండు ఒంటెలను తీసుకెళ్లేవారు. ఒ ఒంటె కడుపులో నీళ్లు ఇగరవుకదా - ఒకటి మోయడానికి తన బరువును - రెండు నీళ్లకి తను తాగడానికి'' మాధురి మాటల్లో లాజిక్, నా మనసు పొరల్లో ఆలోచనలను కెలుకుతోంది.

''అలాగే మీరు మీతో ఇంధనం మోసుకుపోయే బదులు ఇంధనం తయారుచేసే యంత్రాన్ని తీసుకుపోవాలి...''

''అది మాత్రం బరువుకాదా?'' అనడిగాను.

''అందుకే సహారా ఎడారి ఉపమానం చెప్తా'' అంటే రెండు రాకెట్లు ఒకటి ఇంధనం తయారుచేసేది, ఒకటి మనుషులుండేది. నీలైతే యంత్రాలను ముందు పంపి, ఆ తర్వాత మనుషులు వెళ్లొచ్చు...''

అప్పుడే ఓ నిర్ణయానికొచ్చాను - మాధురి డాక్టర్‌గాని ఇంజనీర్‌గాని కాదు - కాని సమయస్ఫూర్తి - లోతుగా ఆలోచించే

శక్తి ఉన్నాయి.

ఇలాంటి అమ్మాయే కావాలి...

మావాడికి! మా అబ్బాయి గిరికి!!

మాధురే నాకు కావలసిన అమ్మాయి! మా కోడలు!! మర్నాడే మాధురి తండ్రిగారికి కబురంపాను. మాధుర్ని మావాడికి చేసుకుంటానికి.

జనవరిలోగాని గిరికి సెలవు దొరకదు. అప్పుడే వివాహం. తిరిగి వెళ్లిన తర్వాత మా గిరి పేచీ పెట్టాడు. డాక్టరో ఇంజనీరో అంటే వట్టి గ్రాడ్యుయేటేనా అని.

నేను మాట్లాడకుండా లేబరేటరీకి [illegible]పోయాను. మాధురి చెప్పిన విషయం [illegible]సుకుంటూ- గిరి అబ్జెక్షన్స్ [illegible]తూ.

''అంగారక గ్రహంలో తొంభై ఐదు శాతం బొగ్గుపులుసువాయువు. ఇది హైడ్రోజన్‌తో కలిస్తే నీరు - మీథేన్ తయారవుతాయి. అంటే వట్టి హైడ్రోజన్ అక్కడకు తీసుకెళ్లి, అక్కడున్న బొగ్గుపులుసువాయువుతో సంధానం చేస్తే, రాకెట్ ఇంధనం మీథేన్ దొరుకుతుంది, బైప్రొడక్ట్ నీరు మనిషి అవసరాలను తీరుస్తుంది. హైడ్రోజన్ తేలిక - మనిషి వెళ్లడానికి ముందు పంపితే మీథేన్ తయారుగా వుంటుంది ఆరు నెలల తిరుగు ప్రయాణానికి. క్వయిట్ ఫీజిబుల్''

మా టీమ్ లీడర్ ఆనందంగా ఎమోషనల్‌గా చెప్పిన విషయాన్ని గిరికి చెప్తే పెదవి విరిచాడు.

''ఒరే బాబూ! కావలసింది డిగ్రీ కాదురా. కామన్‌సెన్స్. కోనసీమలో ఆ అమ్మాయి చెప్పిన 'సహారా ఎడారి' సూత్రం ఆధారంగా మా ఇంధనం సమస్య తీరుతోంది. చూడు ఈ అమ్మాయే అమెరికావాళ్ల బుర్రకు పదును పెట్టింది.

గిరి మాధురి ఫోటో చూశాడు. కెవ్వున అరిచాడు. ''షి ఈజ్ ఇంటెలిజెంట్ - బ్యూటిఫుల్ - ఓహో''

*

## తప్పు

''నువ్వు నీ వివాహానికి ముందు ఓ తప్పు చేశావా? ఏమిటది?'' అడిగాడు మిత్రుడు రంగారావుని.

''నేను పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకోవడం!'' చెప్పాడు మిత్రుడు.

- లకనం మూర్తి (కాకినాడ)

